సాక్షి ఖమ్మం

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



సాయం అందేదెప్పుడు?

మున్నేటి వరదతో నష్టపోయిన పలువురు ఇప్పటికీ సాయం అందలేదని కేఎంసీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 8లో



చెరుకు నాటేందుకు యంత్రం!

చెరుకు మొక్కలు నాటడంలో కూలీల కొరతను అధిగమించేలా రూపొందించిన యంత్రంపై రైతులకు అవగాహన కల్పించారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 16°

వాతావరణం

జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత కాస్త పెరిగే అవకాశముంది. సాయంత్రం తర్వాత మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రైల్వే సంబంధిత సమస్యలు పరిష్కరించండి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీలు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైల్వేస్టేషన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని బీఆర్‌ఎస్ ఎంపీలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఢిల్లీలో సోమవారం సహచర ఎంపీలతో కలిసి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మంత్రికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రైళ్లను కోవిడ్ సమయాన రద్దు చేసినందున వాటిని పునరుద్ధరించడంతో అదనంగా మరికొన్ని రైళ్లు నడపాలని, తిరుపతికి వెళ్లేందుకు ప్రత్యేక రైలు ఏర్పాటుచేయాలని, గాంధీపురం, కారేపల్లి స్టేషన్ల అభివృద్ధి, ఖమ్మం స్టేషన్లో బీహార్, జైపూర్ వెళ్లే రైళ్లను ఆపాలని కోరారు. కాగా, తమ వినతులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఎంపీ రవిచంద్ర తెలిపారు.

వెబ్‌సైట్‌లో డీఈఎల్‌ఈడీ హాల్‌టికెట్లు

ఖమ్మం సహకారనగర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ) ప్రథమ సంవత్సరం అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను www. bse. telangana. gov. in వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. ఈనెల 18 నుండి 24 వరకు ఉదయం 9నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి అదనపు నిధులు



మధిర రైల్వేస్టేషన్ ముఖద్వారం నమూనా

మధిర: అమృత్‌భారత్ పథకంలో భాగంగా ఖమ్మం, మధిర రైల్వేస్టేషన్లు ఎంపిక చేయగా అభివృద్ధి పనులకు గతంలో రూ.25.40 కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. ఇందులో వెయిటింగ్ హాళ్లు, టికెట్ కౌంటర్ల విస్తరణ, పార్కింగ్ సౌకర్యం తదితర పనులు జరుగుతున్నాయి. అయితే, రాష్ట్రంలోని 38రైల్వేస్టేషన్ల అభివృద్ధికి తాజాగా అదనపు నిధులు మంజూరు చేయగా అందులో ఖమ్మం, మధిర రైల్వేస్టేషన్లకు రూ.25.40 కోట్లు చొప్పున కేటాయించారు. ఒక్కో స్టేషన్‌కు రూ.50.80 కోట్ల మేర నిధులు రావడంతో అభివృద్ధి నిధులతో రూపురేఖలు మారనున్నాయి.


నాణ్యత లోపించొద్దు



భోజనాన్ని పరిశీలిస్తున్న సీఎంఓ రాజశేఖర్

ఏన్కూరు: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా అన్ని జాగ్రత్తలు పాటించాలని విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్ సూచించారు. ఏన్కూరులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల, డైనింగ్‌హాల్, సామగ్రి భద్రపరిచే గదులను పరిశీలించడమే కాక విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా ఉపాధ్యాయులు పరిశీలించాలని తెలిపారు. ఆతర్వాత పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన సీఎంఓ వార్షిక పరీక్షలకు సన్నద్ధతపై సూచనలు చేశారు.

మారథాన్‌లో కానిస్టేబుళ్ల ప్రతిభ



పతకాలు సాధించిన కానిస్టేబుళ్లు

ఖమ్మంక్రైం: ఖమ్మం చెందిన ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు హాఫ్ మారథాన్‌లో ప్రతిభ కనబరిచారు. 'రన్ జాతర' పేరిట ఆదివారం హైదరాబాద్‌లో మారథాన్ నిర్వహించగా కానిస్టేబుళ్లు చామకూరి నరేష్, మురారి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఇందులో 21 కి.మీ. దూరాన్ని నరేష్ 1.44గంటల్లో, శ్రీకాంత్ 1.55 గంటల్లో పూర్తి చేశారు. ఈసందర్భంగా పతకాలు అందుకున్న వీరిని పలువురు అభినందించారు.

నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరులో సర్వే చేస్తున్న ఉద్యోగులు





ఇందిరమ్మ

ఇళ్ల సర్వే షురూ..

సొంత గూడు కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కార్యాచరణ మొదలైంది. ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా సోమవారం నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించారు. మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సర్వేను చేపడుతుండగా జిల్లావ్యాప్తంగా అందిన 3,57,869 దరఖాస్తుల ఆధారంగా ప్రజల స్థితిగతులను పరిశీలించి మొబైల్ యాప్‌లో పొందుపరుస్తున్నారు. దరఖాస్తుదారులకు సొంత జాగా ఉంటే ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ యాప్‌లో నమోదు

- పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారుల ఆధ్వర్యాన సర్వే
- ప్రజాపాలన సభల్లో అందిన 3,57,869 దరఖాస్తులు
- పరిశీలన మొదలుకావడంతో నిరుపేదల్లో సొంతింటిపై ఆశలు

400 చదరపు గజాల్లో..

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయించే ప్రక్రియ ప్రారంభించింది. 400 చదరపు అడుగుల స్థలానికి తగ్గకుండా ఇంటి నిర్మాణం ఉంటుందని ఇప్పటికే రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అర్హతల ఆధారంగా లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు కేటాయించనున్నారు. ఇందుకోసం ఇంటి నమూనా కూడా విడుదల చేశారు. లబ్ధిదారులకు నాలుగు దశల్లో నగదు కేటాయింపులు చేస్తారు.

సర్వేతో సంతోషం..

గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని చెబుతున్నాయి. కొందరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించినా పలు అడ్డంకులతో పూర్తిస్థాయిలో అర్హులందరికీ లబ్ధి జరగలేదు. దీంతో పేదలు అద్దె ఇళ్లు, పూరిగుడిసెల్లో గడుపుతున్నారు. వచ్చే నాలుగేళ్లలో ప్రతీ పేదకు ఇల్లు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించడమే కాక తొలిదశలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు, తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించింది. ఈనేపథ్యాన సర్వే మొదలవడంతో దరఖాస్తుదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. అన్ని అర్హతలు ఉన్నందున తమకు ఇల్లు కేటాయించడం ఖాయమని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తొలిరోజు 9వేలకు పైగానే...

ప్రజాపాలన సందర్భంగా సొంత ఇంటి కోసం 3,57,869 దరఖాస్తులు వచ్చాయి. ఒక్క ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనే 53,990 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం వీటి ఆధారంగా సర్వే ప్రక్రియ సాగుతుండగా.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు దక్కుతాయనే నమ్మకంతో దరఖాస్తుదారులు ఉన్నారు. కాగా, తొలిరోజైన సోమవారం జిల్లావ్యాప్తంగా 9,975 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని అధికా రులు వెల్లడించారు. సర్వే పూర్తయ్యాక

ప్రారంభమైన సర్వే

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక కోసం అధికారులు జిల్లావ్యాప్తంగా సర్వే మొదలుపెట్టగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు పాల్గొంటున్నారు. ఈ నిబంధనలను మేరకు ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా వివరాల సేకరణ, యాప్‌లో నమోదుపై ఉద్యోగులకే శిక్షణ ఇచ్చారు. ఈమేరకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు నంబర్లను సరిచూసుకుంటూ సొంత స్థలం ఉందా, అద్దెకు ఉంటున్నారా అని ఆరా తీయడమే కాక సొంత స్థలం ఉంటే డాక్యుమెంట్లను పరిశీలించి స్థలం ఫొటోతో వివరాలను మొబైల్‌యాప్‌లో అప్‌లోడ్ చేయడం మొదలైంది. కాగా, ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తుల ఆధారంగా సర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

మున్సిపాలిటీలు, గ్రామపంచాయల్లో వార్డుల ఆధారంగా ఎంపికైన వారి జాబితా ప్రదర్శిస్తారు.

పద్దెనిమిదేళ్లుగా ఎదురు చూస్తూ..



ఈ ఫొటోలోని మహిళ బొల్లగాని శ్రీదేవి. నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరుకు చెందిన ఈమె భర్త గీత కార్మికుడు కాగా, ఇతర సమయాల్లో వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగించే వీరు 18 ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురు చూస్తున్నారు. ఈ కుటుంబానికి సొంత స్థలం కూడా లేక అద్దె ఇళ్లలోనే ఉంటున్నారు. వీరి ఇద్దరు కుమార్తెల్లో ఒకరు దివ్యాంగురాలు. ప్రజాపాలన సభలో ఇచ్చిన దరఖాస్తు ఆధారంగా సోమవారం సర్వే చేశారని వెల్లడించిన శ్రీదేవి ఈసారైనా సొంతింటి కల నెరవేరుతుందనే ఆశాభావం వ్యక్తం చేసింది.

స్థలం, ఇల్లూ లేదు



చాలాకాలంగా సొంత ఇంటి కోసం చూస్తున్నాం. ఇరవై ఏళ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. కూలీకి వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మాకు సొంత స్థలం కూడా లేదు. ఏళ్లుగా దరఖాస్తు పెట్టుకుంటున్నాం. ఈసారి సర్వే కూడా జరుగుతుండడంతో ప్రభుత్వం సొంతింటి కలను నిజం చేస్తుందని నమ్ముతున్నాం.

– జి.రేణుక, జలగంనగర్, సత్తుపల్లి

ప్రశ్నించేతత్వంతోనే ఎదుగుదల





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ నీరజ, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఈఓ శర్మ తదితరులు

- ప్రతీ అంశాన్ని విద్యార్థులు నిశితంగా పరిశీలించాలి..
- తద్వారా కొత్త ఆవిష్కరణలకు రూపకల్పన
- జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మేయర్ నీరజ

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు చిన్నతనం నుంచే పరిశీలనాశక్తి పెంచుకోవడమేకాక ప్రశ్నించేతత్వం కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ సూచించారు. ఖమ్మం బల్లేపల్లిలోని ఎస్‌ఎఫ్‌ఎస్ హైస్కూల్‌లో రెండు రోజుల పాటు జరగనున్న జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ ఎగ్జిబిట్ల ప్రదర్శన సోమవారం మొదలైంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా అదనపు కలెక్టర్, మేయర్ మాట్లాడుతూ ఆది మానవుల నుంచే అవసరాల కోసం జరిగిన అన్వేషణలో కొత్త ఆవిష్కరణలకు రూపకల్పన మొదలైందని తెలిపారు. అదేతరహాలో విద్యార్థులు సమాజాన్ని పరిశీలించడం, ప్రశ్నించే తత్వం కలిగి ఉండే కొత్త ఆవిష్కరణలు రూపొందించొచ్చని.. తద్వారా ఎంచుకున్న రంగంలో ఎదుగుదల సాధ్యమవుతుందని వెల్లడించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇది మరింత సులువవుతుందని చెప్పారు. అయితే, ఇతర రంగాలతో పాటే రైతాంగానికి ఉపయోగపడే ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 530 ఎగ్జిబిట్లు, 119 ఇన్‌స్పైర్ ప్రదర్శనలు వచ్చాయన్నారు. తొలుత ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్ విద్యార్థులు నృత్యప్రదర్శన ఇవ్వగా తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) ఆధ్వర్యాన విద్యార్థులు, గైడ్ టీచర్లకు టిఫిన్, భోజనం, స్నాక్స్ సమకూర్చారు. జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్, ఏఎంఓ రవికుమార్, ఎంఈఓలు కే.వీ.శైలజాలక్ష్మి, రాములు, శ్రీనివాస్, హెచ్‌ఎంలు కనపర్తి వెంకటేశ్వర్లు, వీరస్వామి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, వివిధ పాఠశాలల యాజమాన్యాలు శ్రీకాంత్, కిషోర్, మతిన్, భాస్కర్‌తో పాటు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్ వివరాలు తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ

తాత్కాలికంగా సమ్మె వాయిదా

ఖమ్మం సహకారనగర్: సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మె చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజులుగా రిలే నిరసన దీక్షలు చేస్తుండగా తమ సంఘం రాష్ట్ర బాధ్యులతో అధికార యంత్రాంగం చర్చలు జరుపుతోందని వెల్లడించారు. ఈ నేపథ్యాన మంగళవారం కూడా రిలే దీక్షలు కొనసాగించి, చర్చలు సఫలం కాకపోతే రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కాగా, సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్మినేని అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల రిలే దీక్షా శిబిరాన్ని సోమవారం సందర్శించిన ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. నాయకులు శిరీష, హరిప్రసాద్, వీరేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

1,19,952 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి

కొణిజర్ల: జిల్లాలో ఇప్పటివరకు రైతుల నుంచి 1,19,952 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కొణిజర్లలోని కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటుచేసిన 340 కొనుగోలు కేంద్రాల ద్వారా 19వేల మంది రైతుల నుంచి 1,19,952 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 1,18,220 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించామన్నారు. రైతులకు రూ.278.29 కోట్లలో రూ.181.83 కోట్ల చెల్లింపు పూర్తయిందని వెల్లడించారు. సన్నరకం ధాన్యం అమ్మిన రైతులు 12,441 మందికి రూ.38.84కోట్ల బోనస్ జమ చేశామని తెలిపారు. జిల్లాలో 65 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే గోదాంలు అందుబాటులో ఉన్నాయని అదనపు కలెక్టర్ వెల్లడించారు. కాగా, కేంద్రాల నిర్వాహకులు రైతులకు ఇబ్బంది ఎదురుకాకుండా చూస్తూ అన్ని వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గంటా శ్రీలత, తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, ఏపీఎం జ్యోతిప్రసన్న పాల్గొన్నారు.



కొణిజర్లలో ఐకేపీ ఉద్యోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

దరఖాస్తులు త్వరగా పరిష్కరించండి

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో అందే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పత్తి రైతుల పడిగాపులు



కారేపల్లిలో జిన్నింగ్‌మిల్లులో ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధికి సంబంధించి సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అయితే, ఒకేసారి ఎక్కువ పత్తి వస్తుండడంతో మిల్లు నిండిపోతోంది. అంతేకాక పత్తిలో తేమ ఎక్కువ ఉందనే కారణంతో కాంటాలు వేయడం లేదు. దీంతో మిల్లు వద్ద పత్తి లోడ్‌తో వచ్చిన వాహనాలు బారులు దీరగా.. రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఏసీబీకి చిక్కిన ఖజానా శాఖ ఉద్యోగి

- పెన్షనర్ సతీమణి నుంచి రూ.40వేలు డిమాండ్
- కలెక్టరేట్‌లోని కార్యాలయంలో పట్టుకున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఏళ్ల తరబడి ఉద్యోగం చేసి రిటైర్డ్ అయిన వ్యక్తి కన్నుమూయగా.. ఆయనకు సంబంధించి బకాయిల బిల్లు చేసేందుకు లంచం డిమాండ్ చేసిన ఉద్యోగిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వివరాలు... తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు పీహెచ్‌సీలో అటెండర్‌గా పనిచేసిన ఓ వ్యక్తి ఉద్యోగ విరమణ చేయగా ఇటీవల మరణించాడు. ఆయనకు సంబంధించి రూ.4లక్షలు రావాల్సి ఉండడంతో మృతుడి సతీమణి జిల్లా ఖజానా శాఖలోని పెన్షన్ సెక్షన్‌లో సంప్రదించారు. దీంతో సీనియర్ అకౌంటెంట్ కట్టా నగేష్ రూ.4లక్షలకు గాను పది శాతం మేర రూ.40వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బాధితురాలు అక్టోబర్‌లో ఏసీబీ అధికారులను ఆశ్రయించగా... వారు బాధితులు సదరు ఉద్యోగితో మాట్లాడిన ఆడియోలు, వీడియోలు సేకరించారు. అనంతరం సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయానికి ఆమెను పిలిపించి లంచం విషయమై మాట్లాడుతున్న నగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవమైన సోమవారం సదరు ఉద్యోగి పట్టుబడడం, అదీ కలెక్టరేట్‌లో కావడం గమనార్హం.



సీనియర్ అకౌంటెంట్ నగేష్

లంచం అడిగినా నేరమే..

ఏసీబీ ఖమ్మం డీఎస్పీ వై.రమేష్ మాట్లాడుతూ లంచం ఇవ్వడం, తీసుకోవడమే కాక డిమాండ్ చేసినప్పటికీ నేరంగా పరిగణిస్తామని వెల్లడించారు. అందులో భాగంగానే పెన్షనర్ సతీమణి నుంచి నగేష్ లంచం డిమాండ్ చేయడంతో అన్ని ఆధారాలు సేకరించాక అరెస్ట్ చేశామని తెలిపారు.

ఖజానా శాఖలో కాసుల గలగల

ప్రతీ సోమవారం ప్రజావాణి జరిగే కలెక్టరేట్‌లో హడావుడి ఉంటుంది. ఈమేరకు కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో మధ్యాహ్నం 12గంటల సమయాన ఉద్యోగి ఏసీబీకి చిక్కాడని తెలియడంతో అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు ఒక్క సారిగా ఉలిక్కిపడ్డారు. కలెక్టరేట్ ప్రారంభమై 23 నెలలు గడుస్తుండగా ఇందులో 31శాఖల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా ఏసీబీ అధికారులకు ఖజానా శాఖ సీనియర్ అకౌంటెంట్ నగేష్ పట్టుపడడం గమనార్హం. కాగా, ఖజానా శాఖ కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు ఇతర శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లను పర్సంటేజీల పేరుతో వేధిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి ఒకే సెక్షన్‌లో పనిచేస్తున్నారు. ఒకవేళ ఇతర చోట్లకు బదిలీ చేసినా మళ్లీ డిప్యూటేషన్‌పై వస్తున్నారు. ఇటీవల బదిలీలు జరిగినా... వేరే ప్రాంతానికి వెళ్లిన ఓ ఉద్యోగి మళ్లీ డిప్యూటేషన్‌పై వచ్చి అదే సెక్షన్ తీసుకోవడం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది. అంతేకాక శాఖలో అధికారులు, ఉద్యోగుల మధ్య అంతర్గత పోరు మొదలైనట్లు సమాచారం. ఈక్రమంలోనే ఓ అధికారి కొందరు ఉద్యోగులను పిలిచి సెక్షన్ల వారీగా నగదు డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈనేపథ్యాన ఏసీబీ దృష్టి సారించడంతో ఖజానా శాఖతో పాటు ఇతర శాఖల ఉద్యోగుల్లోనూ ఆందోళన మొదలైంది.

మొరాయిస్తున్న సర్వర్

- సీఎం కప్ టోర్నీకి పేర్ల నమోదులో క్రీడాకారుల అవస్థలు
- గడువు సమీపిస్తుండడంతో ఆందోళన
- జిల్లాలో ఇప్పటివరకు 5వేల మంది మాత్రమే నమోదు

ఖమ్మం స్పోర్ట్స్: సీఎం కప్ పేరిట గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు క్రీడా పోటీల నిర్వహణకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ షెడ్యూల్ ప్రకటించింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా క్రీడాకారులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించింది. దీంతో క్రీడాకారులు కొందరు సొంతంగా ఫోన్లు, కంప్యూటర్లలో నమోదు చేసుకుంటుండగా.. ఇంకొందరు నెట్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఈక్రమాన రాష్ట్రమంతా క్రీడాకారులు పేర్ల నమోదుకు ముందుకొస్తుండడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. కొన్ని క్రీడాంశాలకు సంబంధించి ఈనెల 10వ తేదీలోపు, మిగతా క్రీడలకు రాష్ట్రస్థాయి పోటీలు జరిగే తేదీనాటికి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో అత్యధిక క్రీడాకారులు ఉండగా పీఈటీలు, గ్రామపంచాయతీ కార్యదర్శి కూడా ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. అయితే, సంబంధిత అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 5వేల మంది మాత్రమే నమోదు చేసుకున్నట్లు సమాచారం. అంతేకాక పది కాలమ్స్ ఉండడంతో ఇంకొందరు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

సంఘాలకు సరిపోదా?

జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఆన్‌లైన్‌లో పేర్ల నమోదు అవసరమని... సీఎం కప్ క్రీడోత్సవాలకు ఎందుకని కొందరు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రం వరకు మాత్రమే నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు ఇచ్చే సర్టిఫికెట్లు ఎందుకూ ఉపయోగపడవని చెబుతున్నారు. అంతేకాక ప్రతీ క్రీడాసంఘం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నప్పుడు సీఎం కప్‌కు అవసరమే లేదని సీనియర్ క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు. గతంలో సీఎం కప్ పోటీలు నిర్వహించినా లేని నిబంధన ఈసారి విధించడం సరికాదని, ఆన్‌లైన్ చేసినా, చేయకున్నా నేరుగా పోటీలకు అనుమతించాలని డిమాండ్ చేస్తున్నారు.

అవసరాలు.. ఆలోచనలు!

- చిట్టిమెదళ్లతో ఎగ్జిబిట్ల రూపకల్పన
- కుటుంబీకుల సమస్యల ఆధారంగా తయారీ
- జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో ఆకట్టుకున్న ఎగ్జిబిట్లు

ఖమ్మం బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో సోమవారం జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన మొదలైంది. రెండు రోజుల పాటు కొనసాగే ఈ సైన్స్‌ఫేర్‌లో 546 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఇందులో ప్రైవేట్ పాఠశాలల నుంచి 250, ప్రభుత్వ, అనుబంధ విద్యాసంస్థల నుంచి 296 ప్రదర్శనలు ఉన్నాయి. అలాగే, ఇన్‌స్పైర్‌కు సంబంధించి 119 ప్రదర్శనలు ఉండగా.. 28 ప్రైవేట్ స్కూళ్లు, 91ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థల విద్యార్థులు తీసుకొచ్చారు. సైన్స్‌ఫేర్‌లో ఎగ్జిబిట్లను పరిశీలించగా చాలామంది తమ కుటుంబీకులు, చుట్టుపక్కల వారి అవసరాలు, వారి కష్టాల నుంచి వచ్చిన ఆలోచనలతో సిద్ధం చేసినట్లు తేలింది. విద్యార్థుల పరిశీలనాశక్తికి నిదర్శనంగా నిలిచిన ఎగ్జిబిట్లను పరిశీలించిన అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శించిన కొన్ని ఎగ్జిబిట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

– ఖమ్మం సహకారనగర్



సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు

ప్రమాదాల నుంచి రక్షణగా..

కల్లూరు మండలం చెన్నూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి సీహెచ్.నాగచైతన్య వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేలా పాథెల్ డిటెక్షన్ డివైస్ రూపొందించాడు. ఈ సెన్సార్‌ను వాహనానికి ఏర్పాటు చేసుకుంటే రహదారులపై ఉండే గుంతలను ముందుగానే తెలియచేస్తుంది. తద్వారా వాహనదారులు జాగ్రత్త పడే అవకాశముండడంతో ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.



తాత కష్టమే ఆలోచనకు నాంది

ఖమ్మంలోని న్యూ ఇరా స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని హాంసిని తాతయ్య కూడా పెరాలసిస్‌తో బాధపడుతుండగా వెంట ఎవరో ఒకరు ఉండాల్సిందే. దీంతో ఆమె సెన్సార్‌తో నడిచేలా వీల్‌చైర్ రూపొందించింది. దీనికి బిగించే బ్యాటరీ సాయంతో పక్షవాతంతో బాధపడుతున్న వారు సొంతంగా పనులు చేసుకోవచ్చు. పాఠశాలకే చెందిన సీహెచ్.లక్ష్మీఅనన్యతో కలిసి హంసిని రూ.వెయ్యి ఖర్చుతో 'ఎస్‌టెచ్యర్ ఇంటలిజెంట్ వీల్‌చైర్' తయారుచేసింది.



ఫ్లడ్ అలారంతో రక్షణ

వరదల సమయాన రక్షణ పొందేలా కూసుమంచి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం.పావని ఫ్లడ్ అలారం రూపొందించింది. సెప్టెంబర్ వచ్చిన భారీ వరదతో కూసుమంచిలో ఓ కుటుంబం మృతి చెందింది. ఈ విషయమై ఆలోచన చేసిన పావని వరదలు వచ్చే పరిస్థితిని ముందుగానే తెలుసుకునేలా ఫ్లడ్ అలారం సిద్ధం చేసింది.

ఆర్గానిక్ మల్చింగ్‌తో ఉపయోగం



ప్రస్తుతం వివిధ పంటల్లో ప్లాస్టిక్ కవర్లతో మల్చింగ్ ఏర్పాటుచేస్తుండడంతో ఆ కవర్లు మట్టిలో కరిగిపోయే పరిస్థితి ఉండదు. తద్వారా భవిష్యత్‌లో ముప్పు పొంచి ఉన్నట్లే. ఈ నేపథ్యాన ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పి.సుమంత్, టి.కీర్తన ఆర్గానిక్ విధానంలో మల్చింగ్ ఏర్పాటుచేసుకునే పద్ధతిని రూపొందించారు. ఈ విధానంలో వివిధ రకాలను మధ్యమధ్యలో సాగు చేస్తే పంటకు ఎరువుగా ఉపయోగపడుతుంది.

మల్టీపర్పస్ అగ్రి రోబో



తక్కువ సమయంలో పంటలు సాగు చేయాలని భావించినా అందుకు ప్రతికూల పరిస్థితులుఎదురవుంటాయి. ఈ క్రమంలోనే ఖమ్మం వివాన్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు బి.ఐశ్వర్య, ఏ.మేఘన తమ కుటుంబాల్లో వ్యవసాయం చేసే వారి ఇక్కట్లను గుర్తించారు. దుక్కి దున్నే క్రమాన సకాలంలో పనులు జరగపోవడంతో పాటు సాగు ఆలస్యమవుతోందని తెలుసుకున్నారు. దీంతో తక్కువ సమయాన సాగు చేయడమే కాక వాటిని పర్యవేక్షించేందుకు మల్టీపర్పస్ అగ్రి రోబోట్‌ను రూపొందించారు.

తండ్రి ఇక్కట్లను చూసి...

కొణిజర్ల జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థి జి.కుమార్ తండ్రి రైతు. ఆయన మిర్చి, వరి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తుంటారు. ఈ క్రమంలో దోమల కారణంగా దెబ్బతింటుండడంతో వాటిని అరికట్టేందుకు తండ్రి పడుతున్న కష్టాన్ని కుమార్ పరిశీలించారు. దీంతో సోలార్ మస్కిట్ అనే ఎగ్జిబిట్ రూపొందించాడు. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసి దాని వద్ద ఒక బల్బ్ పెట్టడంతో కింద నీటితొట్టి ఏర్పాటుచేశాడు. బల్బ్ వెలుతురుకు ఆకర్షితమయ్యే దోమలు దగ్గరి వచ్చినా ఆ వేడికి వేడికి కింద నీటిలో పడి చనిపోతుంటాయి. తద్వారా పంటలకు దోమల బెడద తప్పనుంది.







ఎగ్జిబిట్ తీసుకొస్తున్న విద్యార్థినులు

క్లుప్తంగా

టీ.టీ.లో జాతీయస్థాయి మూడో ర్యాంక్



కోటగిరి హితేష్

ఖమ్మం స్పోర్ట్స్/తల్లాడ: జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీలో జిల్లాలోని తల్లాడకు చెందిన విద్యార్థి సత్తా చాటి మూడో ర్యాంక్ సాధించాడు. ఈనెల 5నుంచి 8వ తేదీ వరకు జాతీయస్థాయి సబ్ జూనియర్ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు జరిగాయి. ఇందులో తల్లాడ బాలభారతి విద్యాలయం ఆరో తరగతి విద్యార్థి కోటగిరి హితేష్ మూడో ర్యాంక్ సాధించి ప్రతిభ చాటాడు. ఈసందర్భంగా విద్యార్థిని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, వీవీఎస్.సాంబమూర్తి, ఎంఈఓ దామోదరప్రసాద్, కేఎస్ఎం విద్యాసంస్థల చైర్మన్ కోటగిరి ప్రవీణ్‌తో పాటు ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఏఓ శశాంత్‌తో పాటు చలపతి, శృతి, మజార్, రామారావు, జోజి చాక్, కామేశ్వరీరెడ్డి, భవ్యచందు, సాయిశివ భినందించారు.

పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక





పుల్లయ్య, రవికుమార్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం(ఎస్‌జీసీఏటీ) జిల్లా కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడిగా పరిశ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా రాయల రవికుమార్, ఆర్థిక కార్యదర్శిగా కనపర్తి వెంకటేశ్వర్లు, సహ అధ్యక్షులుగా కన్నెకంటి కృష్ణమూర్తి, ఐ.వీ.భాస్కరాచారి ఎన్నికయ్యారు. అలాగే, మహిళా ఉపాధ్యక్షులుగా బి.కృష్ణకుమారి, వి.మేరీఏసుపాదం, టి.అంజలి, జి.లక్ష్మీసుజాత, వి.లక్ష్మి, ఉపాధ్యక్షులుగా పెదమాళ్ల సత్యనారాయణ, కొల్లికొండ శరత్‌బాబు, పమిడిమర్రి వీరభద్రరావు, ఊడుగు వెంకటేశ్వర్లు, జి.రామనాథం, పీవీఆర్‌కే.ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య, రవికుమార్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికికృషి చేస్తామని తెలిపారు.

సర్వే వేగంగా పూర్తి చేయాలి




జమలాపురంలో సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

మధిర/ఎర్రుపాలెం: ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు చేపట్టిన సర్వేను ఈనెల 19వ తేదీకల్లా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. మధిర మండలం దెందుకూరు, ఎర్రుపాలెం మండలం కండ్రిక, జమలాపురం ల్లో సోమవారం ప్రారంభమైన సర్వేను ఆమె పరిశీలించారు. ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా కొందరి ఇళ్లలో స్వయంగా వివరాలు సేకరించిన ఆమె ఎలాంటి పొరపాట్లు లేకుండా యాప్‌లో నమోదు చేయాలని ఉద్యోగులకు సూచించారు. తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓలు టీవీఎల్ఎన్.శాస్త్రి, శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బండి నాగేంద్రబాబు, అంగన్‌వాడీ సిబ్బంది సావిత్రి, కృపమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పాలన'

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ దీక్షతో పాటు విద్యార్థులు, ఉద్యమకారుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో ఇప్పుడు ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పాలన సాగుతోందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపేలా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి వెళ్తుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీలోకి రానివ్వకుండా అడ్డుకోవడం గర్హనీయమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని ఆయన తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు



(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,300	4,800
మిర్చి	15,300	5,500
మిర్చి తాలు	7,200	6,000
ఏసీ మిర్చి	16,000	6,900
ఏసీ మిర్చి తాలు	7,000	6,000
పత్తి	7,000	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

మాకు సాయం అందేదెప్పుడు?

- కేఎంసీకి పోటెత్తుతున్న మున్నేటి వరద బాధితులు
- కార్యాలయంలో ఆందోళన తెలిపిన పలువురు మహిళలు
- మొదటి సర్వే ప్రకారం అందరికీ సాయం అందుతుందన్న కమిషనర్
- రెండో విడత సర్వే తర్వాత నిధులు రాలేదని వెల్లడి



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేటికు భారీ వరదలు వచ్చి మూడు నెలలు దాటినా ప్రభుత్వ సాయం అందలేదని బాధితులు ఇంకా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. తమ ఇల్లు వరద నీటిలో మునిగి సర్వం కోల్పోయామని వారు చెబుతున్నారు. చుట్టుపక్కల వారిని సాయం అందినా తమను విస్మరించడం సరికాదని పలువురు వాపోతున్నారు. ఈనేపథ్యాన సోమవారం కూడా కొందరు మహిళలు కేఎంసీకి వచ్చి మొదటి విడతలోనే సర్వే చేసినా సాయం జమ కాలేదంటూ కార్యాలయంలో ఆందోళన చేసి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అదే సమయాన కార్యాలయానికి వచ్చిన కమిషనర్ అభిషేక్ అగస్త్య వారితో మాట్లాడారు. బాధితుల వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి నివేదిక ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. మొదటి విడత సర్వే తర్వాత సాయం అందని వారు ఉంటే జాబితా ఇవ్వాలని సూచించారు.

ఇంకా ఎదురుచూపులే...

సెప్టెంబర్ మొదటి వారంలో మున్నేటి వరద ముంచెత్తగా నీట మునిగిన ఇళ్లు, నష్టపోయిన కుటుంబాల వివరాలను అధికారులు సర్వే చేయించారు. మొత్తం 9,279 కుటుంబాలను జాబితాలో చేర్చగా వీరిలో 1,200 మందికి పైగా అకౌంట్ నంబర్లు తప్పుగా ఇవ్వడంతో నగదు సాయం జమ కాలేదు. ఆపై సరిచేస్తూ వచ్చారు. ఇంకా 80 కుటుంబాల వరకు నగదు సాయం పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పలువురు సర్వే సయయాన లేకపోవడంతో అధికారులు రెండో విడతగా దరఖాస్తులు పరిశీలించి సర్వే చేయగా 2,800 కుటుంబాలు అదనంగా చేరాయి. ఈ కుటుంబాలకు సాయం అందించాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపారు. అయితే, తొలి విడత సర్వేకు సంబంధించిన నిధులు వచ్చినా రెండో జాబితాకు మంజూరు కాలేదు. కాగా, తొలివిడతలో సర్వే పూర్తయిన వారిలో పలువురు సాయం జమ కాలేదని కేఎంసీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఖాతాల్లో జమ అయినా..

వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన అందించిన నగదు సాయం ఖాతాల్లో జమ అయినా కొందరు కేఎంసీకి వస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. బాధితులను ఖాతాలను సరిచూసుకోకుండా వస్తుండడంతో తాము ఆన్‌లైనలో పరిశీలించి చెబుతున్నామని వెల్లడించారు. అలాగే, పలువురి బ్యాంక్ స్టేట్‌మెంట్లను పరిశీలించగా ఈ అంశం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఇంకొందరు కుటుంబంలోని భాగస్వాముల ఖాతా నంబర్ ఇచ్చి ఇప్పుడు తమ ఖాతాలో నగదు జమ కాలేదని ఫిర్యాదు చేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి సమస్యలతో ఏం చేయాలో తోచక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

బాధితులందరికీ సాయం..

మొదటి విడతలో సర్వే జరిగి.. జాబితాలో పేరు ఉన్న ప్రతీ కుటుంబానికి సాయం అందుతుంది. రెండో విడత సర్వేకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందించాం. ఈ నిధులు విడుదలైతే వెంటనే బాధితుల ఖాతాలో జమ చేస్తాం. బ్యాంక్ ఖాతాల్లో తప్పులు దొర్లిన వారి వివరాలు సరిచేస్తున్నాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

చెరుకు నాటేందుకు యంత్రం!



చెరుకు మొక్కలు నాటే యంత్రం పనితీరును వివరిస్తున్న సిబ్బంది

నేలకొండపల్లి: చెరుకు సాగులో కూలీల కొరతను అధిగమించేందుకు మండలంలోని మధుకాన్ షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం మొక్కలు నాటడంతో పాటు కోతలకు యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈసందర్భంగా సోమవారం మండలంలోని బోదులబండ, మండ్రాజుపల్లి, కోనాయిగూడెంల్లో సీడ్లింగ్స్ ప్లాంటర్ యంత్రం ద్వారా చెరుకు మొక్కలు నాటే విధానంపై అవగాహన కల్పించారు. రూ.2.50 లక్షల విలువైన ఈ యంత్రాన్ని తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి తెప్పించగా రోజుకు ఐదు నుంచి ఏడు ఎకరాల్లో మొక్కలు నాటొచ్చని తెలిపారు. అలాగే, చెరుకు నరికే యంత్రం పనితీరును వివరించారు. మార్కెట్ మాజీ చైర్మన్ సూరపనేని రామకృష్ణతో పాటు కట్టికోల సుధాకర్, చింతనిప్పు సైదులు, కొచ్చేర్ల శ్రీనివాసరావు, మేకల నారాయణ, మధుకాన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'మభ్యపెట్టి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్'



చార్జ్‌షీట్ విడుదల చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు

సత్తుపల్లి/వేంసూరు: మాయమాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ హామీని అమలుచేయకుండా ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ విమర్శించారు. సత్తుపల్లిలో సోమవారం పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ పాలనపై చార్జీషీట్ విడుదల చేశారు. ఈసందర్భంగా సత్యనారాయణ, నాయకులు మాట్లాడుతూ పదే పదే పార్టీలు మారే నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాగా, అబద్ధపు హామీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. తొలుత బీజేపీ నాయకులు వేంసూరు మండలంలోని వేంసూరు, మర్లపాడు, భీమవరం గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు తాండ్ర వినోద్‌రావు, బి.వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, నాయుడు రాఘవరావు, మట్టా ప్రసాద్, పాలకొల్లు శ్రీనివాస్, నాగస్వామి, రామారావు, రాంబాబు, నర్సింహారావు, బాలకృష్ణారెడ్డి, దొడ్డపనేని కృష్ణయ్య, పర్స రాంబాబు, మట్టా ప్రసాద్, బాలకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డి సోమవారం 130 మంది వితంతువులు, వృద్ధులకు చీరలు అందజేశారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా చీరలు పంపిణీ చేయగా మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి ఆయనను అభినందించగా నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, బండారు నరసింహారావు, అనుమోలు కృష్ణారావు పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన పిన్నెల్లి ఉపేందర్‌రావు(20) స్థానిక రైల్వేగేట్ సమీపాన సోమవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపిన వివరాల... మద్యానికి బానిసైన ఉపేందర్‌రావు తరచుగా తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నాడు. అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోయినట్లు ప్రవర్తించే ఆయన మద్యం సేవించాక విజయవాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..

ముదిగొండ: పురుగుల మందు తాగిన మహిళకు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మండలంలోని రాఘవపురానికి చెందిన చిన్నబోయిన సుధ ముదిగొండలో గ్రామదీపికగా పనిచేస్తోంది. సుధ – ఉపేందర్ దంపతుల మధ్య మనస్పర్థలు, అప్పుల కారణంగా పది రోజుల క్రితం ఆమె పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందింది

చెరువులో పడి వ్యక్తి...

తల్లాడ: చెరువులో పడినో వ్యక్తి మృతి చెందగా సోమవారం మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు... తల్లాడకు చెందిన తడికమళ్ల వెంకటేశ్వర్లు(55) ఈనెల 7న మధ్యాహ్నం కూలి పనికి వెళ్లొచ్చాక ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆరోజు నుంచి వెంకటేశ్వర్లు కనిపించకపోవడంతో ఆయన కోసం కుటుంబీకులు గాలిస్తున్నారు. ఇంతలోనే వారి ఇంటికి సమీపాన ఉన్న గుంటు చెరువుకట్టపై చెప్పులు కనిపించగా గాలించడంతో ఆయన మృతదేహం బయటపడింది. అప్పటికే మృతదేహం కుళ్లిపోవడంతో ప్రొక్లెయినర్ సాయంతో బయటకు తీయగా స్థానికంగానే పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శశికుమార్ తెలిపారు. అయితే, వెంకటేశ్వర్లు చెరువులో ఎలా పడ్డాడో తెలియరాలేదు.

పూడ్చిన మృతదేహాన్ని తీసి పంచనామా

కొట్టి చంపారనే అనుమానంతో ఫిర్యాదు

కారేపల్లి: మండలంలోని మాణిక్యారం గ్రామపంచాయతీ పరిధి రూప్లాతండా గ్రామంలో ఈనెల 6వ తేదీన అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తిని ఖననం చేయగా, ఆయన సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు సోమవారం మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా చేపట్టారు. రూప్లాతండాకు చెందిన బధరుడు, మతిస్థిమితం లేని భూక్యా హరిదాస్(45) ఈనెల 6న జీపీ బోరుబావి వద్ద మృతి చెంది కనిపించాడు. దీంతో విద్యుదాఘాతంతో చనిపోయి ఉంటాడని భావిస్తూ అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, అదేగ్రామానికి చెందిన నూనావత్ బాష్‌సింగ్ పత్తి చేనులో హరిదాస్ పత్తి దొంగిలించాడనే నెపంతో కొట్టగా మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. ఈక్రమంలోనే హరి కుటుంబీకులు బాష్‌సింగ్ దంపతులపై దాడి చేశారు. ఆపై మృతుడి సోదరుడు సక్రు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్‌ఐ ఎస్.రాజారాం, తహసీల్దార్ సంపత్‌కుమార్ ఆధ్వర్యాన హరిదాస్ మృతదేహాన్ని బయటకు తీయించి మెడికల్ కాలేజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాథోడ్ ఆధ్వర్యాన పంచనామా నిర్వహించారు. అలాగే, దాడి జరిగినట్లు భావిస్తున్న ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్ ద్వారా తనిఖీలు చేపట్టారు.

బడ్డీ కొట్టులో చోరీ

మధిర: మండలంలోని సిరిపురంలో పెట్రోల్ బంక్ సమీపాన ఉన్న సాతుపాటి లక్ష్మికి చెందిన బడ్డీ కొట్టులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు తాళాలు పగలగొట్టి లోపల ఉన్న నగదు, సరుకులను అపహరించారు. అంతేకాక కూల్‌డ్రింక్స్ ఫ్రిడ్జిని ధ్వంసం చేశారు. చిరువ్యాపారంతో జీవనం సాగిస్తున్న తన కొట్టులో చోరీతో తీవ్ర నష్టం ఎదురైందని బాధితురాలు వాపోయింది. కాగా, మండలంలో ఇటీవల వరుస చోరీలు జరుగుతున్న నేపథ్యాన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రిపూట పోలీసు పెట్రోలింగ్ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

మామిడితోటలో ఆయిల్ ఇంజన్...

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం సమీపాన తాటిపల్లి వీరభద్రంకు చెందిన మామిడి తోటలో ఆయిల్ ఇంజన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీ చేశారు. గ్రామ సమీపంలోని హైస్కూల్ వెనక మామిడి తోట గేట్ తాళాన్ని పగలగొట్టిన దుండగులు షెడ్‌లోని రూ.22వేల ఆయిల్ ఇంజన్‌ను ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధిత రైతు ఫిర్యాదుతో ఎస్‌ఐ పి.వెంకటేష్ దర్యాప్తు చేపట్టారు.

ఒంటరి మహిళపై లైంగికదాడి

రఘునాథపాలెం: మండలంలోని ఓ గ్రామంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. సదరు వివాహిత భర్త గత ఏడాది క్రితం మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తోంది. అదేగ్రామానికి చెందిన జానీ రాత్రి ఆమె ఇంట్లోకి దూరి లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బాధితురాలిను వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

కల్వర్టుపై భారీ గుంత



గుంతలో పరిశీలిస్తున్న రైతులు

నేలకొండపల్లి: రైతులు పొలాల వైపు వెళ్లేందుకు కల్వర్టు దాటుతుండుగా ఒకసారిగా ఊగడమే కాక గుంత పడడంతో ఆందోళనకు గురయ్యారు. మండలంలోని మంగాపురంతండాలో సోమవారం ఉదయం రైతులు తేజావత్ వైకుంఠం, భూక్యా సీత్యా, భూక్యా గోబ్రియా, తేజ్, నాగేశ్వరరావు మంగాపురం మేజర్ కాల్వపై కల్వర్టు మీదుగా పొలాలకు వెళ్తున్నారు. ఈక్రమాన కల్వర్టు ఒక్కసారిగా ఊగడమేకాక పెద్ద గుంత పడింది. దీంతో రైతులు ఉలిక్కిపడగా పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. కల్వర్టు నిర్మించి చాలా ఏళ్లు కావటంతో శిథిలావస్థకు చేరడంతోనే ఇలా జరిగిందని భావిస్తున్నారు.